క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కొలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు

తాళ్లపూడి: గ్యాస్ సిలిండర్ లీకవడంతో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన మేక సత్తెమ్మ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఆర్థిక సాయం అందజేసారు. మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు చేతుల మీదుగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసారు. కొలిశెట్టి నాగేశ్వరరావు రూ. 2 వేలు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు తోట రామకృష్ణ, బట్టు సుబ్బారావు రూ.వెయ్యి చొప్పున బాధిత కుటుంబానికి అందజేసారు. ప్రభుత్వ నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సాయం అందలేదని, అధికారులు స్పందించి బాధితులను ఆదుకోవాలని వారు కోరారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి



కూసం రామ్మోహన్‌రెడ్డి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షుడిగా గోపాలపురానికి చెందిన కూసం రామ్మోహన్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు రామ్మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జిల్లా వ్యవసాయ మండలి సభ్యుడిగా, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా కార్యదర్శిగా, సొసైటీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు.

అభయాంజనేయస్వామికి పూజలు

చాగల్లు: హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా చాగల్లులో అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధ సిందూరంతో స్వామి వారికి అష్టోత్తర పూజ నిర్వహించారు. పవిత్ర పుణ్య నదీ జలాలతో స్వామివారికి అభిషేకాలు, లక్ష నాగవల్లి దళార్చన, విశేష పుష్పలంకరణ, పంచామృతాభిషేకం వంటి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బ్రాహ్మణగూడెంలో బీసీ కాలనీలో హనుమాన్ ఆలయంలో ఆదివారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పెరవలిలో అన్న సమారాధన

పెరవలి: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, నల్లాకులపాలెం, పెరవలి, కాపవరం, అజ్జరం, కాకరపర్రు గ్రామాలకు చెందిన 15 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



హుకుంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

గోపాలపురం: నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం, భీమోలు, హుకుంపేట, రాజంపాలెం గ్రామాల్లో శనివారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామదర్శిని ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో యోగా దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక వ్యాధులను అధిగమించడానికి యోగా సాధన చేయాలన్నారు. గ్రామాల్లో యోగా దినోత్సవంపై విస్తృతంగా ప్రచారం కల్పించి ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, టి.గోపాలకృష్ణ, కేవీ సుబ్బన్న పాల్గొన్నారు.

సేంద్రియంతో భూసారం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- పొలం దున్నే సమయంలోనే చర్యలు
- రసాయన ఎరువులతో చీడపీడలు పెరుగుతాయంటున్న శాస్త్రవేత్తలు



పొలాల్లో వేసేందుకు పశువుల పెంటను తరలిస్తున్న రైతులు



చేలల్లో గుట్టలుగా వేస్తున్న పశువుల పెంట

నల్లజర్ల: తొలకరికి ముందు రైతులు తమ పొలాల్లో పశువుల ఎరువు వేస్తుంటారు. కొద్ది రోజుల తర్వాత భూమి దున్నే సమయంలో మరికొంత కోళ్ల ఎరువు, జీవాల ఎరువులు వేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఈ మేరకు సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారించి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశువుల పేడ, చెఱువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. మరి కొందరు ఇతర రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అనేక మంది రైతులు ఈ సేంద్రియ సాగు విధానానికి సన్నద్ధమవుతున్నారు. తరచూ రసాయన ఎరువులు వినియోగం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ వివరిస్తున్నారు. పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు. అంతేగాక భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండి పోకుండా దోహదపడతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పోలాల్లో చీడపీడలు, తెగుళ్ల సోకవన్నారు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పోటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడి ఇస్తాయని ఆయన తెలిపారు.


దిగుబడి బాగుంటుంది



పంటవేసే ముందు పశువుల ఎరువును ఎకరాకు నాలుగు ట్రక్కులు వేసి కలియదున్నడం వల్ల భూమి గుల్లబారుతుంది. పంట దిగుబడి కూడ బాగుంటుంది. భూమిలో నీటి తేమ ఎక్కువగా ఉంటుంది. మొక్కలకు రోగనిరోధక శక్తిగా ఉపయోగపడుతుంది. పైరు ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు సోకకుండా ఉంటాయి. వేపపిండి కలపడం ద్వారా పురుగులు నశిస్తాయి.

కె.కమల్‌రాజ్, వ్యవసాయాధికారి, నల్లజర్ల

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం వేలాది మంది భక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుజాము నుండే వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చారు. ఒకవైపు భారీ వర్షం కురుస్తున్నా ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. భక్తులకు దాతల ఆర్థిక సహాయంతో 5 వేల మందికి ఉచిత అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన, ప్రసాదాల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. స్వామి వారికి పూల అలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం వంటి కార్యక్రమాలకు భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామని తెలిపారు.

వధూవరులకు వనిత ఆశీర్వాదం



షేక్ బాజీ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రి వనిత, ఇతర నాయకులు

గోపాలపురం: రాష్ట్ర మాజీ హోం మంత్రి వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత శనివారం పలు వివాహవేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సాగిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాజీ కుమారుడి దంపతులను ఆమె ఆశీర్వదించారు. కరగపాడు పిన్నెల్లి సుందర్‌రావు కుమార్తె పుష్పాలంకరణకు హాజరయ్యారు. ఈమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్,సర్పంచ్‌లు కురుకూరి ధనలక్ష్మి, ఇళ్ల శ్రీరామమూర్తి,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి



ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి: పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, గ్రామాభివృద్ధికి యాజమాన్యం సహాయ సహకారాలు అందించాలని అన్నదేవరపేట సర్పంచ్‌తోపాలు పలువురు గ్రామస్తులు కోరారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేటలో క్యాప్రికార్న్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ విస్తరణ కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, తాళ్లపూడి ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి ఆధ్వర్యంలో ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ముందుగా పయనీర్ సంస్థ ప్రతినిధి సంతోష్‌కుమార్ కంపెనీ వివరాలు తెలియజేసారు. మొదట్లో తేజ బయో ఫ్యూయల్ కంపెనీ 60 కేఎల్‌తో ప్రారంభించారని అనంతరం క్యాప్రికార్న్ డిస్టిలరీ యాజమాన్యం దానిని టేకోవర్ చేసిందన్నారు. కంపెనీ 90 కేఎల్ నుంచి 180 కేఎల్‌కు సామర్థ్యం పెంచనున్నట్టు తెలిపారు. విస్తరణ వల్ల అదనంగా ఎటుంవంటి బాయిలర్లు నిర్మించేది లేదని తెలిపారు. ప్రస్తుతం 247 కేఎల్ గోదావరి నీటిని ఉపయోగిస్తున్నారని, అదనంగా 908 కేఎల్ నీటిని ఉపయోగిస్తారని తెలిపారు. 736 కేఎల్ వ్యర్థ జలాలు వస్తాయని వీటిని శుద్ధి చేసి మొక్కలకు సరఫరా చేస్తారన్నారు. ఇందుకు సుమారు 7 ఎకరాల్లో మొక్కలు పెంచుతాయని పేర్కొన్నారు. కంపెనీ వల్ల ఎటువంటి వాయు, జల, శబ్ద కాలుష్యం వెలువడదని తెలిపారు. ఈ సందర్భంగా 13 మంది తమ అభిప్రాయాలను నేరుగా, 13 మంది లిఖిత పూర్వకంగా తెలియజేసారు. వీటిని రికార్డు చేసి అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వి నంద, పోశిన శ్రీకృష్ణదేవరాయలు, హరిప్రసాద్, గణపతి, వెంకటేశ్వరరావు, రమేష్, ఎన్‌జీవోలు జేపీ రామారావు తదితరులు మాట్లాడుతూ కంపెనీలో స్థానికులకు ఉద్యోగావకాశాల కల్పన, గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం కృష్ణన్ ఉన్నతన్, జీఎం మూర్తి, సర్పంచ్ ఎలిపే సుధారాణి, గ్రామస్తులు, ఎన్‌జీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. వాహనదారులకు అవస్థలు



నిడదవోలు చర్చిపేట సెంటర్‌లో ప్రధాన రహదారిపై తిష్ట వేసిన పశువులు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహన చోదకులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నిడదవోలు : పట్టణంలో ప్రధాన రహదారులపై పశువుల సంచారం ఎక్కువైంది. పశువుల యజమానులు తమ పశువులను విచ్చలవిడిగా పగలు, రాత్రివేళలో పట్టణ పురవీధుల్లో వదిలేస్తున్నారు. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణేష్‌చౌక్ సెంటర్, గణపతి జంక్షన్, చర్చిపేట మార్కెట్ ఏరియాల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉంది. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వాటిని బయటకు వదలడంతో అవి గుంపులుగా సంచరిస్తూ పట్టణంలోని ప్రధాన సెంటర్లలో తిష్ట వేస్తున్నాయి. దీంతో ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాలు, ద్విచక్ర వాహనాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్ల మధ్యలో అడ్డంగా గుంపులుగా అవి ఉండడంతో వాహనచోదకులు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సమయంలో పశువులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

గుంపులుగా పశువుల సంచారం

ఇటీవల గణేష్‌చౌక్ సెంటర్‌లో పశువులు గుంపులుగా ఉండడంతో ద్విచక్ర వాహనదారుడు వాటిని దాటించే క్రమంలో ప్రమాదాన్ని గురై గాయాలపాలయ్యాడు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రధాన రహదారులపై అడ్డంగా పశువులు తిష్ట వేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనదారులు హారన్ కొడుతున్నప్పుడు పశువులు చెల్లాచెదురై పరుగులు పెడుతూ ద్విచక్ర వాహనాలపైకి దూసుకుపోతున్నాయి. దీంతో వాహన చోదకులు కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. పశువులు రాత్రంతా రోడ్లపై మకాం వేయడంతో మలమూత్ర, విసర్జన చేయడంతో ఆ పరిసరాలు అంతా అపరిశుభ్రంగా తయారై దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఇక్కడ నెలకొంది.

గో సంరక్షణ కేంద్రాలకు తరలించాలి

చాలాకాలంగా యజమానులు తమ పశువులను రోడ్లపై విడిచిపెడుతున్నా మున్సిపల్ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లుగా ఉండడం లేదు. చాలాసార్లు పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. పశువుల యజమానులకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా లెక్కచేయకుండా పశువులను ఇష్టం వచ్చినట్లుగా వదిలేస్తున్నారు. గతేడాది మునిసిపల్ సిబ్బంది రోడ్లపై సంచరిస్తున్న ఆవులను పట్టుకొని నిర్బంధించారు. అప్పట్లో కొందరు సిఫార్సుతో వాటిని విడిచిపెట్టారు. అయినా యజమానులు వారి పద్ధతి మార్చుకోలేదు. పట్టణంలో సుమారు వందకు పైగా పశువులు సంచరించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పశువులను గో సంరక్షణ కేంద్రాలకు తరలించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

తాళ్లపూడి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు చోట్ల నీరు చేరడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. మండలంలో 57 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో మండలంలో పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షానికి గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. తాళ్లపూడి బజార్ సెంటర్‌లో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ముందు వర్షం నీరు నిలిచిపోయింది. ముందు భాగంలోని సరస్వతీ దేవి విగ్రహం వద్ద పల్లంగా మారడంతో తరచూ నీరు నిలిచిపోతోంది. దీంతో లోపలికి వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. అదేవిధంగా గజ్జరంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై నీరు నిలిచిపోయింది.



తాళ్లపూడిలోని మెయిన్ రోడ్డుపై వర్షం నీరు



గజ్జరం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న ముంపు నీరు

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, బంధువులు

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగబోయే డీఎస్సీలో ఎస్‌జీటీ, ఎస్ఏ (గణితం) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉపయోగపడేలా డైట్ సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ షార్ట్ కట్స్ ఇన్ మేథమెటిక్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీన్ని శనివారం కుటుంబ సభ్యుల మధ్య తన మనవరాలు కియాన్ష చేతుల మీదుగా ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గణిత సమస్యలను సులభంగా సాధించడానికి వీలుగా షార్ట్ కట్స్, సింపుల్ టెక్నిక్స్, మెమరీ టెక్నిక్స్‌తో ఉదాహరణల రూపంలో తెలియజేశానన్నారు. ఈ పుస్తక రచనలో ప్రోత్సహించిన డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇంటర్మీడియట్, డిగ్రీలో గణితాన్ని బోధించిన అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీ విశ్రాంత గణిత ఉపన్యాసకులు భమిడిపాటి కామశాస్త్రికి ఈ పుస్తకాన్ని అంకితచేశానన్నారు.

కొవ్వాడ కాలువలో పూడికతీత పనులు ప్రారంభం



గజ్జరం వద్ద కొవ్వాడ కాలువ పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ఆధునీకకరణ పనులు చేపడుతున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలంలోని గజ్జరం రాగోలపల్లి, తాడిపూడిలోని కొవ్వాడ కాలువ పూడిక తీత పనులు శనివారం ఎమ్మెల్యే ముప్పిడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పాలిట శాపంగా ఉన్న కొవ్వాడ ముంపు నుంచి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. గత ప్రభుత్వం రైతును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొవ్వాడ కాలువ పూడిక తీత పనులకు రూ. 3 కోట్లు కేటాయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని గజ్జరం, తుపాకుల గూడెం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, కొవ్వూరు మండలం ధర్మవరం, కాపవరం, చాగల్లు మండలంలోని పలు గ్రామాల్లో ఈ పనులు కొనసాగుతాయని తెలిపారు. నాలుగు భాగాలుగా విభజించి నామినేషన్ పద్ధతిలో పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, ఎంపీపీ కె.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన రేషన్ డీలర్లు

తాళ్లపూడి (కొవ్వూరు): జూన్ ఒకటి నుంచి పాత విధానంలో రేషన్ డీలర్ల వద్ద నుంచే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావును శనివారం పలువురు రేషన్ డీలర్లు కలిసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలో మొబైల్ రేషన్ వాహనాలను రద్దు చేసి రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో తమకు మేలు జరుగుతుందని డీలర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

26 నుంచి అంత్యకాల ఉజ్జీవ సువార్త సభలు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రాంగణంలో ఈనెల 26, 27 తేదీల్లో అంత్యకాల ఉజ్జీవ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ హిజ్కియా శనివారం తెలిపారు. దైవజనులు ఆర్.లాజరస్, ఎస్‌జే విల్సన్‌బాబు, ప్రిన్స్ వన్య, జీవరత్నం వాక్యోపదేశం అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఇంటి నిర్మాణాల క్రమబద్ధీకరణ

ఉండ్రాజవరం: అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో అనధికారంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహసీల్దార్ పీఎన్‌డీ. ప్రసాద్ శనివారం తెలిపారు. జనవరి 29, 2025న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2019 అక్టోబర్ 15 కంటే ముందుగా మండలంలోని అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో అనధికారంగా నిర్మించిన ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. అనధికారంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులు ఇంటి పన్ను, కరెంట్ బిల్లులతో తమ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 చదరపు గజాల్లో నిర్మించిన ఇంటిని ఉచితంగా క్రమబద్ధీకరిస్తారన్నారు. సచివాలయాలకు వచ్చిన దరఖాస్తులను మండల కమిటీ, డివిజనల్ కమిటీలు పరిశీలిస్తాయన్నారు. పూర్తి వివరాలకు సచివాలయాల్లో గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.

దేవరపల్లి: అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో అనధికారకంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరణ చేస్తున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ శనివారం తెలిపారు. పూర్తి వివరాల కోసం గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని ఆయన తెలిపారు.